ప్రజాశక్తి
ఆదివారం 5 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక డుంబ్రిగూడ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని స్థానిక అల్లూరి యూత్ అధ్యక్షుడు కే.సూర్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం చాపరాయి జలపాతం టెండర్ ముగియడంతో ఐటిడిఏ, టూరిజం శాఖ అధికారులు ఆధీనంలో తీసుకుని ప్రవేశ రుసుం టికెట్లు వసూలు చేస్తున్నారన్నారు. ఐటిడిఎ అధీనంలో తీసుకున్నా స్థానిక డుంబ్రిగూడ యువతకు ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో పంచాయితీ ద్వారా టెండర్ పాట నిర్వహించాలని కోరారు. స్థానికంగా సొసైటీ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి నిర్వహణ బాధ్యతను అప్పగించాలన్నారు. అనేకమంది నిరుద్యోగ యువత డిగ్రీ, పీజీలు, బీఈడీలు, బీటెక్ చేసి ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక ఖాళీగా ఉన్నారన్నారు. ఈ విధంగానైనా స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అల్లూరి నాయకులు నవసూర్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపై ఆదివాసీల గర్జన

- ఏజెన్సీ జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరిక
- రేగులపాలెంలో బహిరంగ సభ, ర్యాలీ
- విల్లంబులు ఎక్కుపెట్టిన మాజీ ఎంపీ మధు, గిరిజన నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు, వేదికపై సురేంద్ర, అప్పలనర్స, గంగరాజు తదితరులు

ప్రజాశక్తి - అనంతగిరి :గిరిజన చట్టాలను ఉల్లంఘించి తమ మనుగడను ప్రశ్నార్థకం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏజెన్సీలో పెడితే సంప్రదాయ ఆయుధాలతో తరిమి తరిమి కొడతామని పలువురు నేతలు, ఆదివాసీలు హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధి రేగులపాలెం గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ శనివారం ఏర్పాటు చేసిన సభ విజయవంతమైంది. భారీగా గిరిజనులు తరలివచ్చారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ బహిరంగ సభలో సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీకి చట్ట విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయంతో కట్టబెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా రేగులపాలెం గ్రామంలో నిర్మించే హయ్యర్, లోయర్ హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు కోసం రాష్ట్ర గవర్నర్, సిఎంలను కలిసి లిఖితపూర్వకంగా విన్నవిస్తానన్నారు. తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ బాక్సైట్ పోరాటం మాదిరిగానే హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాటమూ ఉధృతమవుతోందన్నారు. అభివృద్ధి పేరిట అధికారులను రంగంలో దించి దొడ్డిదారిన సర్వేలు నిర్వహించి ప్రాజెక్టు పనులు చేపడితే సంప్రదాయ ఆయుధాలతో కంపెనీలను తరిమికొడతామన్నారు. ఇప్పటికే హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణ ప్రాంతాలైన ఎర్రవరం, చిట్టంపాడు. రేగులపాలెం గ్రామాల్లో పోరాటాలకు పదును పెట్టామన్నారు. సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేసి, ఆమోదానికి జిల్లా పరిషత్, ఐటిడిఎ సమావేశాల్లో గళం విప్పుతానన్నారు. గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు డి.వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, టోకూరు సిపిఎం సర్పంచ్ మొస్య, పెదకోట మాజీ సర్పంచ్ జంపరంగి దేముడు, నాయకులు జె.ఈశ్వరరావు, సింహాచలం, జి.ఆనంద్, ఎస్.దేముడు, రేగులపాలెం, కుడియా, తమటు, పెదకోట, పిన్నకోట, కొండిబ కోట తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదంలో గిరిజనుల జీవన మనుగడ

పాడేరు : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గిరిజనుల జీవన మనుగడ ప్రమాదంలో పడిందని మాజీ ఎంపీ పి.మధు అన్నారు. స్థానిక అటవీ శాఖ అతిథి గృహంలో శనివారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు జరగకపోవడంతో రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. వైసిపి పాలన అధ్వానంగా ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్ల తొలగింపుతో విద్యార్థులు సెరిబ్రల్ మలేరియా వంటి అనారోగ్య పరిస్థితుల్లో వైద్యమందక మరణిస్తున్నారని అన్నారు. జీవో నెంబర్ 3 రద్దు వల్ల గిరిజనులకు ఉద్యోగావకాశాలు దూరమయ్యాయని అన్నారు. ఇటీవల ఇరిగేషన్ శాఖలో 450 పోస్టులు రిక్రూట్ చేస్తే గిరిజనులకు కేవలం నాలుగు ఉద్యోగాలే వచ్చాయని తెలిపారు. 1/70 రెగ్యులేషన్‌పై ప్రభుత్వం ఇంప్లిట్ కావాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో నాలుగు హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రకటించారని, వీటివల్ల 97 గ్రామాలు, 15 వేల మంది గిరిజన జనాభా, 20 వేల ఎకరాల సాగు భూములు ప్రమాదంలో పడతాయని తెలిపారు. గిరిజనులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న హైడ్రో ప్రాజెక్టుల ప్రతిపాదనను ప్రభుత్వం విరమించాలని డిమాండ్ చేశారు. రైల్వే జోన్‌కు అవసరమైన నిధులు బడ్జెట్‌లో మన రాష్ట్రానికి రాలేదని అన్నారు. విశాఖలో గంగవరం పోర్టును జగన్మోహన్ రెడ్డి కారు చౌకగా అదానీకి కట్టబెట్టారని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదన వల్ల ప్రమాదంలో పడిందని తెలిపారు. సమావేశంలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, మండల కార్యదర్శి ఎల్.సుందరరావు పాల్గొన్నారు

హాజరైన గిరిజనులు

మారథాన్‌లో పాల్గొన్న జిల్లా అగ్ని మాపక అధికారి శ్రీనివాస్, సిబ్బంది

ఆరోగ్య సంరక్షణకు మారథాన్

- జిల్లా అగ్నిమాపక అధికారి పేరూరి శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం

ఆరోగ్య సంరక్షణకు మారథాన్ చాలా ఉపయోగపడుతుందని జిల్లా అగ్ని మాపక అధికారి పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రంపచోడవరం, చింతూరు పరిధిలో చేపట్టిన ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమంలో భాగంగా హాఫ్ మారథాన్‌ను శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణకు శారీరక వ్యాయామం, మానసిక వ్యాయామంతో పాటు పరుగు కూడా చాలా దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం రంపచోడవరం అగ్నిమాపక కార్యాలయం వద్ద ప్రారంభమైన మారథాన్ పోక్స్ పేట మీదుగా తిరిగి రంపచోడవరం చేరుకుంది. ఈ మారథాన్‌లో భాగంగా జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి పేరూరి 43 కిలోమీటర్లు పరుగు చేయగా, రంపచోడవరం కేంద్రం అగ్నిమాపక అధికారి పంపన శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది డిఎల్.నారాయణ, ఎంజి.సప్తగిరి, పివి.సత్యనారాయణ, ఎ.వెంకన్నదొర 21 కిలోమీటర్లు, ఆర్.వెంకన్న, బి. రామచంద్ర రావు, జే.నాగేశ్వర రావు, కే.శంకర రావు 12 కిలోమీటర్లు పరుగు తీసి అందరిలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.

పాడైపో పోయిన తాగునీటి పథకం బోరును పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి తదితరులు

మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నేత సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొనితాగు నీటి సమస్యలను ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని ఎంపిపి కారం లక్ష్మి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండాకాలం వస్తున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమన్నారు. శనివారం వారు మండలంలోని కుందులూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా కుందులూరు గ్రామంలో నీటి ఎద్దడి ఉన్నా పట్టించుకునేఏ అధికారే లేరని, ఇదేనా గిరిజన అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. గుల్లేటి వాడ గ్రామ గిరిజనుల తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు మేలుకొని కుందులూరుతో పాటు మండలంలోని గ్రామాలలో నీటి పథకాలు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తి బాబు, లక్ష్మణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ప్రధాన రహదారి వెంబడి నిర్మించిన డ్రైనేజీ దాటి నిర్మించిన షాపులను స్వచ్ఛందంగా తొలగించాలని పంచాయతీ, రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి ఆక్రమణదారులకు సూచించారు. డ్రైనేజీ దాటి షాపుల అక్రమణల వలన పట్టణంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణంలోని షాపుల యజమానులు, చిరు వ్యాపారులతో శనివారం మోదమాంబ కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో డ్రైనేజీ కాలువలపై, కాలువలు దాటి ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగించాలని స్పష్టం చేశారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటే అధికారులే తొలగిస్తారని హెచ్చరించారు. కూరగాయల వ్యాపారులు పాత బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ వద్ద రైతు బజార్ కు వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, ఎంపిడిఒ సాయి నవీన్, ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ ఐ లక్ష్మణరావు,

సంతలో కొనుగోలు చేస్తున్న దళారులు

దళారుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలోని శనివారం జరిగిన వారపు సంతలో దళారులు హవా సాగింది. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చెల్లించకుండా దళారులు మోసాలకు పాల్పడుతున్నారని గిరిజన రైతు లు వాపోయారు. శనివారం వారపు సంతలో పిప్పలు మోడీ కేజీ రూ.300 ధర పలికినప్పటికి తారం కొట్టి తక్కువ కేజీలు చేసి డబ్బులు చెల్లించారు. వీటిపై మార్కెట్ కమిటీ, అధికారులు పట్టించుకోక పోవడంతో దళారులు విచ్చల విడిగా తనకు నచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారు. బెట్టు కాటాలతో మోసాలకు పాల్పడుతున్నారు. హుకుంపేట వారపు సంతకు గిరిజనులు పండించిన పసుపు, పిప్పలి మోడీ, రాజ్‌మా, అల్లం, కాఫీ వంటి వాటిని తీసుకొస్తుంటారు.

వారపు సంతలో మోసాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి- మారేడుమిల్లి

మండలంలోని వారపు సంతల్లో జరుగుతున్న మోసాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దారు టి. శ్రీనివాస్‌కు సిపిఎం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గిరిజనుల నిత్యాసరాలకు ఇక్కడి వారపు సంతలే ప్రధాన ఆధారమని, తెలిపారు. కొంతమంది వ్యాపారస్తులు ఇదే అదునుగా చేసుకొని గిరిజనులకు అధిక ధరలకు అమ్మడం, నాసిరకం వస్తువులు, నకిలీ వస్తువులు అంటడడుతున్నారని పేర్కొన్నారు. పాడైపోయిన కూరగాయలు, కుళ్లిపోయిన చేపలు, వివిధ రకాల జబ్బులతో ఉన్న కోళ్లను అమ్ముతున్నారని, అలాంటి వ్యాపారస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో పాతకోట, పోతవరం, ఆకు మామిడికోట, మారేడుమిల్లి ఇలా అన్ని సంతల్లోనూ వస్తువులను అధికారులు తనిఖీ చేయాలని కోరారు. నకిలీ, నాసిరకం, కుళ్లిన వస్తువులు అమ్మే వ్యాపారస్తులపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్క షాప్ ముందు ధరల పట్టిక పెట్టాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన వస్తువులను అమ్మాలని లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మట్ల వాణిశ్రీ, ఈతపల్లి సత్యనారాయణ, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రామారావు తదితరులు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోదొడ్డి గ్రామంలో గతేడాది ఫిబ్రవరి 2న విషపూరితమైన జీలుగు కల్లు తాగి మృతి చెందిన ఐదుగురు గిరిజన కుటుంబాలను నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ అల్లి సత్యనారాయణకు శనివారం సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన చెదల సుగ్రీవు, వేమ లోవరాజు, బుసరి సన్యాసిరావు, పొత్తూరు గంగరాజు, కుడే ఏసుబాబు నాడు మృతి చెందారని, నాడు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు గ్రామంలో పర్యటించి మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సంఘటన జరిగి సంవత్సరం గడిచినా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా సాయం అందకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కె జగన్నాథం, మేలిన రమేష్, జర్తా రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్

సంకల్ప దీక్షను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: పాత పెన్షన్ సాధనకై పాడేరులో జరిగే సంకల్ప దీక్ష సభను ప్రభుత్వం అరెస్టులతో భగ్నం చేయడం అప్రజాస్వామికమని రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు నేరం చేసినట్లుగా ముందస్తు నోటిసులు ఇచ్చి అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సంకల్ప దీక్షను చేపడుతున్నామన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు కేంద్రాల్లో పాడేరు, రంపచోడవరం, చింతూరు కేంద్రాల్లో చేపడుతున్నామని చెప్పారు.ఈ దీక్ష కు జిల్లా నలుమూల నుండి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కన్నయ్య, మండల సహా అధ్యక్షులు ఎస్.బాలకృష్ణ, మండల కార్యదర్శి ఆనంద్ కిల్లో, మేఘనాథ్ తుచ్చ, పోరపు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో గాయపడిన గిరిజన బాలుని కుటుంబాన్ని ఆదుకోవాలి

గిరిజన సంఘం మండల అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి

ప్రజాశక్తి - రంపచోడవరం

అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడి వారం రోజుల పైబడి చికిత్స పొందుతున్న గిరిజన బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాదల విద్యా సాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వెట్టి చెలకలు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టి చెలకలు గ్రామంలో కొండపోడు వ్యవసాయం వద్ద పొదల నుంచి అడవి పంది వచ్చి దాడి చేయడంతో గిరిజన బాలుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గిరిజనులు వేటాడితే నేరం అంటూ కేసులు పెట్టే ఫారెస్ట్ అధికారులు, అడవి మృగాలు గిరిజనులపై దాడి చేస్తే పట్టించుకోక పోవడం దారుణమన్నారు. జంతువులకు ఉండే విలువ గిరిజనులకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడవి మృగాలు, కోతుల నుండి గిరిజనులను, వారి పంటలను రక్షించుకోవడానికి సోలార్ విద్యుత్ పెన్సింగ్ (కంచె)ను, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చోడి మొత్తాయి దొర, మడకం వీరాయమ్మ, కుర్ల పాండవ రెడ్డి, కొండ్ల సన్యాసి రెడ్డి, వంజం ముత్తన్న దొర, శంభుడు సోమలమ్మ, కుర్ల శ్రీనివాస రెడ్డి, కుర్లా వరహాల రెడ్డి, శంభుడు ప్రతాప్ రెడ్డి, నెల్లూరి శ్రీనివాస్ రెడ్డి, నెల్లూరి రాజ్ కుమార్ రెడ్డి, నెల్లూరి ఎర్రన్న దొర, వంజం కృష్ణదొర, చోడి వెంకన్న దొర, అరగాటి వెంకట రెడ్డి, సాదల రామిరెడ్డి, సాదల రామకృష్ణ రెడ్డి, సాదల ప్రతాప్ రెడ్డి, సాదల సుగ్గిరెడ్డి, పాల్గొన్నారు పాల్గొన్నారు.

త్వరలో కల్వర్టులు, రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి- కూనవరం

రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి కార్యాచరణ రూపొందిస్తామని పంచాయతీ రాజ్ జెఇ రామకృష్ణ రెడ్డి తెలిపారు. మండలం రేగులపాడులో వర్షాకాలం వస్తే మనుషులు నడవడానికి, వాహనాలు తిరగడానికి వీధుల్లో రోడ్ల పరిస్థితి బాగా లేదని, రోడ్లు, కల్వర్టులు నిర్మాణం చేయాలని స్థానిక సర్పంచ్ బొగ్గా రామారావు విజ్ఞప్తి మేరకు శనివారం పిఆర్ జెఈ రామకృష్ణ రెడ్డి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కల్వర్టలకు కొలతలు ఇప్పించడం జరిగిందని, త్వరలోనే మొదలు పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్, సిపిఎం నాయకులు గుండం బాబూరావు, గ్రామ పెద్దలు తుర్రం తమ్మయ్య, కుంజా వెంకట సుబ్బు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన మొదాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

నాటుసారా తరలిస్తున్న యువకుడు అరెస్టు

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర- ఒడిశా సరిహద్దు నుంచి సీలేరు ప్రాంతానికి అక్రమంగా నాటుసారా తరలిన్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.... సీలేరు రెగ్యులేటరీ డ్యామ్ రహదారిపై పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఆంధ్ర ఒడిశా సరిహద్దు గుంటువాడ పంచాయతీకి చెందిన దుల్బో అనే యువకుడు నాటు సారా తరలిస్తూ పట్టుబడ్డాడు. ఆయన వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, ఆ యువకున్ని అరెస్టు చేశారు. అనంతరం దుల్బోపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సారా అక్రమ రవాణా ఇప్పటికైనా గిరిజనులు విరమించుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

పట్టుబడిన నాటుసారా, నిందితునితో పోలీసులు

వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

సంగంవలసలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని కొర్రా పంచాయతీ సంగంవలస గ్రామంలో శనివారం స్థానిక పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని గొర్రెలు, మేకలకు సుమారు 150 మూగజీవాలకు పిపి ఆర్ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిని రాజశ్రీ మాట్లాడుతూ, మూగజీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకుగాను పిపిఆర్ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో మూగజీవాలకు ఎటువంటి వ్యాధులు ప్రబలినా తక్షణమే సంబంధిత పశు వైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఎలు ఎస్.త్రినాధరావు, ఏ.జానకమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనేతరుడి ఇల్లు స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజనేతరుడు సకల భక్తుల సూర్యారావుకు చెందిన ఇల్లుని తహసిల్దార్ నర్సమ్మ, ఇన్చార్జి ఎంపీడీవో రమేష్ ల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇంటిని మరొక గిరిజ నేతరుడికి క్రయవిక్రయాలు జరిపినట్టు గిరిజన సంఘం, అఖిలపక్షం నేతలు తహసిల్దార్ కు గతంలోనే ఫిర్యాదు చేయడంతో ఎట్టకేల్లకు శనివారం గృహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, మండల గిరిజన సంఘం నేత ఎంఎం శ్రీను,మాట్లాడుతూ, 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు కొంతమంది మైదాన ప్రాంతం నుండి వచ్చి ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకోవడం తగదన్నారు. 1/70 చట్ట ప్రకారం గిరిజనేతరులు గిరిజన ప్రాంతంలో భూములు కొనడం, అమ్మడం చేయరాదన్నారు. కొంతమంది పలుకుబడి ఉన్న రాజకీయ నాయకుల అండదండలతో అధికారుల కనుసన్నల్లో 1/70చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, వీఆర్వో సిహెచ్ రమేష్, వర్తక సంఘం అధ్యక్షులు ఎస్.ప్రసన్నకుమార్, గాసిరాం దొర, మోహన్, భూషణ్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో పించాయి పుట్టు గ్రామ పంచాయతీ దారపల్లి గ్రామంలో శనివారం సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 130 మంది గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం గిరిజనులకు రగ్గులను పంపిణీ చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో గతంలో రేడియోలు, గొడుగులు సైతం పంపిణీ చేశామన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపతి, స్థానిక సర్పంచ్ సుభాష్ చంద్ర పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ చేస్తున్న సిఆర్పిఎఫ్ అధికారులు

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలకు బకాయి పడ్డ రెండు నెలల జీతాలు తక్షణమే ఇవ్వాలని మండల కేంద్రంలోని స్థానిక కళ్యాణ మండపం వద్ద సిఐటియు మండల కార్యదర్శి కుర్ర శంకర్‌రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు, మినీ ఆయాలకు గత రెండు నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. అంగన్వాడీలకు కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని, గ్రాడ్యూటీ చెల్లించారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ర.5లక్షలు, 2017 నుంచి పెండింగ్ లో ఉన్న టిఏ, డిఏ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఫేషియల్ అటెండెన్స్ యాప్ రద్దు చేసి, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ పేరుతో వేధింపు ఆపాలన్నారు. ఈనెల 6న పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను, రాందాస్, అంగన్వాడి కార్యకర్తలు భవాని, సుజాత, శ్రీదేవి, మావుళ్ళమ్మ, అంగన్వాడి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి దీనబంధు డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో విజిట్‌ల పేరుతో వేదింపులు ఆపాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. 2020-21 సంవత్సరంలో విధుల్లో చేరిన అంగన్వాడీ లకు 9 నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు (సిఐటియు)జి.మోధకొండమ్మ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు గా టిఏ, డిఏ లు చెల్లించలేదని, రకరకాల యాప్‌లతో తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, జాబ్ క్యాలెండర్ నిర్ణయించి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు వి.మహేష్, ప్రాజెక్టు, సెక్టార్ నాయకులు రాజేశ్వరి, విజయకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

ఫైలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి గురుమూర్తి

రక్తపరీక్షలకు రక్త పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాడేరు సచివాలయం పరిధిలోని సుంద్రుపుట్టు, చాకలిపేట వీధుల్లో ప్రజలకు శుక్రవారం రాత్రి పది గంటల నుండి 12 గంటల వరకు ఫైలేరియా నిర్ధారణ పరీక్షల సర్వేను మినుములూరు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి గురుమూర్తి మాట్లాడుతూ, ఇటీవల కాలంలో సుంద్రుపుట్, చాకలిపేట గ్రామాల్లో నాలుగు ఫైలేరియా కేసులు నమోదు అయ్యాయని, దీంతో వ్యాధి వ్యాపించకుండా ఉండడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకునే చర్యల్లో భాగంగా సుంద్రుపుట్టు, చాకలిపేట గ్రామాల్లో రాత్రి వేళలో ఫైలేరియా నిర్ధారణ రక్త పరీక్షల సర్వే నిర్వహించామన్నారు. ఫైలేరియా నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేస్తుందన్నారు. ప్రజలకు ఫైలేరియాపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లలకు, గర్భిణీలకు ఫైలేరియా టెస్టులు చేయమని, మిగిలిన వారందరూ రక్త పరీక్షలు చేసుకునేందుకు స్వచ్ఛంగా ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని ఆయన చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి, ఇంటి ప్రాంతంతో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతిరోజు ఇంటి చుట్టు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలను వాడాలన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ధనుంజయ, మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఎలీషా రావు, లక్ష్మణరావు, చలం. నాగరాజు, శంకర్రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గీతంలో ఉత్సాహంగా 'షోర్ ఫెస్ట్ -23'

ప్రజాశక్తి -మధురవాడ

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో రెండోరోజు శనివారం షోర్ ఫెస్ట్ -23లో ఉత్సాహంగా సాగింది. హీరోయిన్ రెజీనా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ సంప్రదాయ దుస్తులలో పెద్దఎత్తున హాజరైన విద్యార్థులు కేరింతల మధ్య గీతం ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రో- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరక్టర్ రాహుల్ సింగ్, స్పోర్ట్స్ డైరక్టర్ అరుణ్‌కార్తీక్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తిలో యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అరవింద్‌స్వామి సెంథిల్ కుమార్ (26) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఫ్యానుకు ఉరివేసుకునానరు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎయు ఆచార్యుల పరిశోధనా పత్రానికి అవార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుల పరిశోధనా పత్రానికి బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు, నగదు పురస్కారం లభించాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ ప్రచురించే ప్రతిష్టాత్మక జర్నల్‌లో విభాగ ఆచార్యులు జిఎంజె రాజు, జివిఎస్ శర్మ, కెవి.రమేష్, సి.భాస్కరశర్మల పరిశోధన పత్రం ప్రచురితమైంది. ఈ పరిశోధన పత్రానికి మూడు విభాగాలలో కెమికల్ వీక్లీ అవార్డు, ఐఐసిహెచ్ఇ ఎన్ఆర్‌సి అవార్డు, కూలూర్ మెమోరియల్ అవార్డులు లభించాయి. ఈ మేరకు దీనికి సంబంధించిన ధ్రువపత్రాలను ఏయూ ఆచార్యులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ అందించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆచార్యులను అభినందించారు. ప్రతిష్టాత్మక జర్నల్‌లో నాణ్యమైన పరిశోధన పత్రాలను ప్రచురించడం, అవార్డులు సాధించడం వర్సిటీకి గర్వకారణంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలను ప్రచురించాలని సూచించారు.

సిడిసి డీన్‌గా ఆచార్య సత్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆచార్య ఎన్.సత్యనారాయణ పదవీ కాలం ముగియడంతో నూతన డీన్‌గా ఆచార్య సత్యనారాయణరెడ్డిని నియమించారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి ఆచార్య సత్యనారాయణరెడ్డి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ డీన్ ఆచార్య ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ బిఓఎస్ చైర్‌పర్సన్‌గా లలిత భాస్కరి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా విభాగ ఆచార్యులు డి.లలిత భాస్కరి నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను లలిత భాస్కరి స్వీకరించారు. అనంతరం ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో విభాగంలో బిఓఎస్ చైర్‌పర్సన్‌గా లలిత భాస్కరి బాధ్యతలను స్వీకరించారు.

యోగాపై శాస్త్రీయ పరిశోధనలు : ప్రొఫెసర్ మంజునాథ్ శర్మ

ప్రజాశక్తి -భీమునిపట్నం : యోగాపై శాస్త్రీయ పరిశోధనలు ఆవశ్యమని బెంగళూర్ స్వయాసాకు చెందిన వైస్‌ఛాన్సలర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌కె మంజునాథ్ శర్మ అన్నారు. స్థానిక కృష్ణా కాలనీ యోగా చైతన్య సంస్థ ప్రాంగణంలో యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు పేరిట రెండు రోజులు నిర్వహించే శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ శర్మ మాట్లాడుతూ, యోగా పై చేసే శాస్త్రీయ పరిశోధనలు ప్రజలకు చేరువ కావాలన్నారు. యోగా ద్వారా అనేక వ్యాధులను నయం చేయవచ్చని స్పష్టం చేశారు. బిపి, సుగర్, కేన్సర్, స్త్రీలకు సాధారణంగా వచ్చే వివిధ రకాల వ్యాధులపై చేసిన పరిశోధనలను వివరించారు.

న్యూఢిల్లీకి చెందిన మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా, మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర వి బసవారెడ్డి, ముంబై ఇండియన్ యోగా ఇనిస్టిట్యూట్ అకడమిక్స్ అండ్ అవక్రిడేషన్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ గణేష్ రావు, గీతం యూనివర్సిటీ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ సైకాలజీ డాక్టర్ కె.సునీత తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. విజినిగిరి యోగా కన్సియస్‌నెస్ ట్రస్ట్ అధ్యక్షులు టిఎల్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగా చైతన్య సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుభద్ర

అర్హులందరికీ పింఛన్లు అందాలి

- జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అర్హులైన వారందరికీ పింఛన్లు అందాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, నిర్మాణపు పనులకు సంబంధించి వారి వారి మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు అందడంలేదని, దానికిగల కారణాలు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టరును అడిగి తెలుసుకున్నారు. కళ్యాణమస్తు పథకం గురించి వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. హౌసింగ్ విభాగానికి సంబంధించి జగనన్న కాలనీలు మార్చి 31వ తేదీకి నిర్మాణాలు పూర్తి చేసి, గృహ ప్రవేశాల కోసం సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అల్పాదాయ వర్గాలను విస్మరించిన బడ్జెట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు అత్యంత నిరుత్సాహంగా ఉన్నాయని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలకు సమస్యలను, వాటికి పరిష్కారాలను బడ్జెట్‌లో ఏమాత్రమూ ప్రతిపాదించలేదని తెలిపారు. సంపన్న వర్గాలపై పన్ను విధించకపోవడం, వారిపైగల పన్ను తగ్గింటం చూస్తే వారు మరింత సంపన్నులు కావడానికి ఈ బడ్జెట్ దోహదపడుతోందని అర్థమవుతోందన్నారు. .దేశంలో నిరుద్యోగ రేటు శాతం 8.3 పెరగటం ఆందోళన కలిగించే విషయం అయినప్పటికీ ఈ బడ్జెట్‌లో వారికి ఉద్యోగాలు కల్పన ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి బిఎస్.రాంబాబు, సంయుక్త కార్యదర్శి పివి.కృష్ణారావు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను స్వాగతించిన ఫ్యాప్సీ

ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఈ ఏడాది బడ్జెట్‌ను స్వాగతించింది. నగరంలోని ఓ హోటల్‌లో 'యూనియన్ బడ్జెట్ 2023-24లో వాణిజ్యం, పరిశ్రమలకు చిక్కులు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో సిఎ అసోసియేట్లు అనిల్ కుమార్, గౌతమ్ రాఖ్, టాక్సేషన్ నిపుణులు గౌతమ్ పరాఖ్ మాట్లాడారు. లీలా వరప్రసాద్, డాక్టర్ హేమ యడవల్లి పాల్గొన్నారు.

జి-20 సమ్మిట్‌కు జివిఎంసి గెస్ట్ హౌస్ సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కిర్లంపూడి లే అవుట్‌లోగల మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ గెస్ట్ హౌస్ ఇకపై జి-20 సెక్రటేరియేట్ వేదిక కానుందని, శనివారం రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి స్మార్ట్ సిటీ నిధులతో పునర్నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారని కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రప్రథమంగా అధికారులతో జి-20 ఏర్పాట్లుపై సదస్సు నిర్వహించారన్నారు. ఆ సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

వాల్తేరుకు పెద్దపీట

డివిజన్‌లో పనులకు రూ.2875.85 కోట్లు
దక్షిణ కోస్తా రైల్వే, రాయగడకు కలిపి రూ.10 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తర్వాత పూర్తిస్థాయిలో కేటాయింపుల వివరాలను చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.8406 కోట్ల మేర నిధులు రానున్నాయి. వాల్తేరు రైల్వే డివిజన్‌కు మాత్రం పెద్దపీట వేశారని చెప్పొచ్చు. తూర్పు కోస్తా రైల్వేకు రూ.2857.85 కోట్ల నిధులను వివిధ పనుల కోసం కేటాయించారు. అయితే అందరూ ఎదురుచూస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు మాత్రం రూ.10 కోట్లే కేటాయింపులు చేయడం విచారకరం. అది కూడా రాయగడ నూతన డివిజన్ కేంద్రం కోసం కూడా దీన్నుంచే వినియోగించాలని సూచించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి నూతన కార్యాలయానికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు గతంలోనే కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్ ప్రకటన చేశారు. శంఖుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విశాఖకు ఇటీవల వచ్చిన సందర్భంలో దీనికి శంకుస్థాపన చేస్తారని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. రూ.10 కోట్లతో కొత్త రైల్వేజోన్ కార్యాలయ పనులు ఎలా సాధ్యమో కేంద్రం చెప్పాలి.

పలు ప్రాజెక్టులకు కదలిక

వాల్తేరు డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.1717 కోట్లు వస్తాయని తెలుస్తోంది. రన్నింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం, కొత్త లైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడం చేయనున్నారు. కొత్త లైన్ల నిర్మాణానికి రూ.285 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ.2180 కోట్లు, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగు కోసం రూ.51.13 కోట్లు, ట్రాక్ రెన్యువల్స్‌కు రూ.261.43 కోట్లు, సిగ్నల్ అండ్ టెలికాం పనులకు రూ.30.84 కోట్లు, రహదారి భద్రత, ఆర్ఓబిలకు రూ.16.96 కోట్లు, వంతెన పనులకు రూ.9.93 కోట్లు, వర్క్‌షాప్‌లు, ప్రొడక్షన్ యూనిట్లకు రూ.2.56 కోట్లు, ఇతర పనులకు రూ.12.1 కోట్లు, మెషినరీ ప్లాంట్లకు రూ.1.62 కోట్లు కేటాయింపులు జరిగాయి. కొత్త లైన్లు జైపూర్ నుంచి మల్కన్ గిరికి రూ.135 కోట్లు, జైపూర్ నుంచి నవరంగపూర్‌కు రూ.100 కోట్లు, నౌపాడ గుణుపూర్ కొత్త బ్రాడ్ గేజ్ లైన్ తిరువెళి వరకు రూ.50 కోట్లుతో ఏర్పాటు కానున్నాయి. డబ్లింగ్ పనుల విషయానికొస్తే కిరండోల్-జగదల్‌పూర్‌కు రూ.135 కోట్లు, జగదల్‌పూర్-కోరాపుట్‌కు రూ.170 కోట్లు, విజయనగరం- సంబల్‌పూర్ మూడో లైన్‌కు రూ.920 కోట్లు, కొత్తవలస-కోరాపుట్‌కు రూ.410 కోట్లు, కోరాపుట్-సింగాపూర్ రోడ్డుకు సుమారు రూ.500 కోట్లు కేటాయింపులు చేశారు. ట్రాఫిక్ సౌకర్యాల మెరుగు కోసం సింహాచలం నార్త్ నుంచి గోపాలపట్నం యార్డు వరకు రూ.7.5 కోట్లతో పనులు చేపట్టనున్నారు. చీపురుపల్లి ఎల్ 4 కన్వర్షన్‌కు రూ.84.54 లక్షలు, గోపాలపట్నం -విజయనగరం ఆటో సిగ్నలింగ్, సింహాచలం బైపాస్‌కు రూ.32.78 కోట్లు, కోచింగ్ కాంప్లెక్స్‌కు రూ.10 కోట్లు, వాల్తేరు డివిజన్ ట్రాక్ రెన్యువల్స్ కోసం రూ.25 కోట్లు, పలాస-విశాఖపట్నం-దువ్వాడలకు రూ.40 కోట్లు, కోరాపుట్-సింగపూర్ రోడ్డుకు రూ.20.01 కోట్లు, వాల్తేరు మార్షలింగ్ యార్డుకు 1.01 కోట్లు, సింగపూర్ రోడ్డు - విజయనగరానికి రూ.25 కోట్లు కేటాయించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సదస్సులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖపట్నం డివిజన్‌లో ఈ నెల 6న, రాజమహేంద్రవరం (అమలాపురం డివిజన్)లో 7న, ఏలూరు డివిజన్‌లో 9న, శ్రీకాకుళం (పాలకొండ డివిజన్‌లోని రాజాం సబ్ డివిజన్)లో 15న, విజయనగరం (విజయనగరం డివిజన్‌లోని భోగాపురం సబ్ డివిజన్)లో 17న ఆయా ప్రాంతాల్లోని కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను ఛైర్‌పర్సన్, సిజిఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అంతేకాకుండా విశాఖపట్నం సీతమ్మధారలోని ఎపిఈపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సదస్సుల్లో తనతోపాటు సిజిఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ పాల్గొంటారని తెలిపారు

ఎయులో అక్రమాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయులోని అక్రమాలపై విచారణ జరపాలని, వీసీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ప్రసాద్‌రెడ్డి వీసీగా బాధ్యతలు చేపట్టిన నుంచి తీసుకొచ్చిన నూతన సంస్కరణల ఫలితాలపై చర్చించారు. ఈ విధానాలు విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపక, అధ్యాపకేతరులకు, ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రసాద్ రెడ్డి అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నిస్తున్న వారిపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగులను ఉపయోగించి చట్ట విరుద్ధంగా వాటర్, ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు తొలగించటంలాంటి నీచమైన పనులకు దిగజారిపోవడం హేయమైన చర్యని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ నాయకులు బి.గౌతమ్, సూర్య, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఫణీంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోదొడ్డిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేతలు

ప్రజలపై భారాలు వేస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆరోపించారు. శనివారం లోదొడ్డి గ్రామంలో ఇదేం ఖర్మా మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడంతోపాటు, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయని తెలిపారు. వాటిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మనోవర్తి రామకృష్ణ చౌదరి, కోటం శెట్టి సత్యనారాయణ, బారంగి అనుదీప్, సూరిశెట్టి సురేష్, గిడుతూరి శ్రీను, పసగడుగుల రాంబాబు, బచ్చా సత్యనారాయణ, పసగడుగుల తేజ, జిరెడ్డి రాంబాబు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రజావ్యతిరేక విధానాలపై చైతన్యం చేశారు. ప్రజల చేత మిస్డ్ కాల్స్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, గ్రామ కమిటీ అధ్యక్షులు దిండి జనార్ధన్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు, షేక్ ఇబ్రహీం, యూనిట్ ఇన్‌ఛార్జి సిద్ధ వెంకన్న దొర, ధారా వెంకన్న ,చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు వెల్లడించారు. శనివారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కళాశాలలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రం రావడానికి తన వంతు కృషి చేసినట్లు చెప్పారు. వచ్చే ఏడాది సిఇసి, హెచ్ఈసి గ్రూపులను ఇంగ్లీషు మీడియంలోకి మార్చేందుకు, అదనంగా సైన్స్ గ్రూపులు ప్రారంభించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సైన్స్ గ్రూపులు ఏర్పాటుకు నాలుగు రూములు అందుబాటులో ఉండాలని, దానికి ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు కావాలని కోరారు. నాడు నేడు పథకం ద్వారా మంజూరైన నిధులతో టాయిలెట్లు మరమ్మతులు, మైనర్ రిపేర్లు చేపడుతున్నామని చెప్పారు. కాలేజీ చుట్టుపక్కల ఎత్తుపల్లాలను జెసిబితో చదును చేస్తుమన్నారు. ఈ స్థలాన్ని విద్యార్థులకు గ్రౌండ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల నూతన భవనాలు ఏర్పాటుకు మూడు ఎకరాలు స్థలం కావాల్సి ఉందని, ఏపీ జెన్కో అధికారులు స్థలాన్ని కేటాయించే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, సాయిరాం, ఎల్‌యువివిఎస్‌ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి రైతు బజార్‌ను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీలోని రైతు బజార్‌ను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ ద్వారం వద్ద ఆర్చి బర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సంప్రదాయ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం ప్రత్యేక స్టాళ్లు నిర్మించాలన్నారు. రైతు బజారులో సదుపాయాలను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకులు సుధాకర్, ఉప ప్రాంతీయ సంచాలకులు ఎర్రన్న, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్‌కె.యాసిన్, ఇఇ కోటయ్య పాల్గొన్నారు